

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక జిల్లా ఆసుపత్రిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి గురువారం పరిశీలించారు. ఆసుపత్రిలోని మానసిక చికిత్స విభాగాన్ని, మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితులను, ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి వారికి తెలియజేశారు. ఈ సేవలను వినియోగించు కోవాలని తెలిపారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

- పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య
- రీసర్వే చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పోలవరం స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం పోలవరం నిర్వాసితులతో ప్రవీణ్ ఆదిత్య సమావేశమయ్యారు. సిపిఎం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం 'పోలవరం నిర్వాసితుల పోరుకేక' పేరుతో 450 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించడంతో పాటు ఈ నెల 4న విజయవాడలో మహాధర్నా చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసిత ప్రతినిధులను ప్రభుత్వం చర్చలకు పిలిపించింది. ఇందులో భాగంగా రెండో సమావేశం ధవళేశ్వరంలో జరిగింది. విలీన మండలాల్లోని నిర్వాసితుల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని సమస్యలను వివరించారు. దీనిపై స్పెషల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. 41వ కాంటూరు పరిధిలో ప్రభావితమయ్యే గ్రామాలన్నింటికీ దశల వారీగా పునరావాసం, ప్యాకేజీ అందిస్తున్నట్లు తెలిపారు. లైడార్ సర్వే ద్వారా మరో 36 గ్రామాలు చేర్చామన్నారు. గ్రామ సభ తీర్మానం చేసి పంపితే డిపార్టులో వారికి కూడా పరిహారం చెల్లించేలా చూస్తామన్నారు. నిర్వాసితులకు సాగు భూమి చూపించాల్సిన బాధ్యత అధికారులదేనని అంగీకరించారు. పునరావాస కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంటూరు లెక్కలను మరోసారి రీ సర్వే చేయాలని కోరారు. ప్రభుత్వ లెక్కలకంటే మునిగిపోతున్న గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. పాలనా యంత్రాంగం నిర్వాసితులకు భరోసా కల్పించాలన్నారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖాళీ చేసే తేదీని పరిగణలోకి తీసుకోవాలని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు. ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ పునరావాస కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరదల నేపథ్యంలో ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం రంపచోడవరం కార్యదర్శి బి.కిరణ్ మాట్లాడుతూ కాంటూరులతో సంబంధం లేకుండా, చొప్పరపల్లిలో జిరాయితీ భూములను చూపించాలని, కొంత మందికి పట్టాలు ఇవ్వలేదన్నారు. మరో ప్రాంతంలో 44 ఎకరాల సాగు భూమికి సర్వే నెంబరు తప్పుగా ఇచ్చారన్నారు. జీడిగుప్ప పంచాయతీలో కొటారుగొమ్ము ప్రజలకు ఎటపాకలో ఇచ్చిన భూములు సాగుకు అనుకూలంగా లేవన్నారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అర్హత ఉండి అనేక మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నగదు చెల్లించలేదన్నారు. పునరావాస కాలనీల్లో ఇళ్ల శ్లాబులు కారుతున్నాయన్నారు. చిగురుమామిడి కాలనీ వర్షాలకు మునిగిపోతున్నాయన్నారు. వాడపల్లి కాలనీలో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. కొరుటూరులో స్కూలు, ప్రభుత్వ భవనాలకు విద్యుత్, తాగునీటి సరఫరా లేదన్నారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ పోలవరం వద్ద 38 మీటర్ల ఎత్తున గోడ కట్టడంతో వరదలకు నీరు చేరిందని అప్పటికే సుమారు 193 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత 41.05 మీటర్ల ఎత్తులో నీరు నిల్వచేస్తే నాలుగు మండలాలు పూర్తిగా ముంపునకు గురవుతాయన్నారు. ఈ సమావేశంలో చింతూరు. మండల కార్యదర్శి సీసం సురేష్, విఆర్.పురం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, కూనవరం మండలం సిపిఎం కార్యదర్శి సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, కుక్కునూరు సిపిఎం కార్యదర్శి వై.నాగేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు



సమావేశానికి హాజరైన పోలవరం నిర్వాసితుల ప్రతినిధులు



కాటన్ బ్యారేజీ వద్ద వరదనీటి ప్రవాహం

ఉధృతంగా గోదారి

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. ఇప్పటికే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరదనీటి ప్రవాహం చేరింది. ఎగువున కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. గురువారం సాయంత్రం నాటికి భద్రాచలం వద్ద 43 అడుగల నీటి మట్టం నమోదైంది. దీంతో అక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద వరదనీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం అక్కడ 34.10 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9.6 అడుగులకు నీటి మట్టం చేరకుంది. దీంతో కాటన్ బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 6,94,226 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. శుక్రవారం నాటికి కాటన్ బ్యారేజీ వద్ద మరింత వరద వచ్చే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. లంక గ్రామాలను అప్రమత్తం చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

గోదావరికి వరదనీటి ప్రవాహం పెరగడంతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, రాజమహేంద్రవరం, కొవ్వూరుల్లోని ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా, డివిజినల్ స్థాయి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంచడం కోసం షిఫ్ట్‌ల వారిగా సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. కలెక్టరేట్ - 8977935609, రాజమండ్రి ఆర్‌డిఒ కార్యాలయం 0883-2442344, కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం - 9440295493 నెంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు. వరద వచ్చే అవకాశం ఉన్నందున, గోదావరి పరివాహక గ్రామాలు, లంక గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూసేందుకు, ఈ మేరకు సమాచారం అందించడం కోసం కంట్రోలు రూం ఏర్పాటు చేశామన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

వర్షాలు వరదల నేపథ్యంలో కొవ్వూరు డివిజన్ పరిధిలోని తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల్లో గోదావరి పరీవాహక గ్రామ పంచాయతీల కార్యదర్శులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కొవ్వూరు డివిజన్ డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి పరీవాహక ప్రదేశంలో రేవులు, స్నానఘట్టాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లాష్ లైట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఓటరు నమోదు కార్యక్రమానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల ఓటరు నమోదు అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024'పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎస్ఎస్ఆర్-2023కు చెందిన ఓటర్ల సవరణ తుది జాబితా 2023 జనవరి 5న ప్రచురించామన్నారు. ప్రస్తుతం ఎస్ఎస్ఆర్ 2024 ప్రక్రియలో భాగంగా బిఎల్ఒల వారీగా అన్ని రాజకీయ పార్టీలకు అన్ని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓటర్ల తుది జాబితా అందించామన్నారు. ఇకపై నియోజక వర్గ స్థాయిలో ప్రతి మంగళవారం, జిల్లా స్థాయిలో ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటుహక్కు కలిగి ఉండేలా అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. ఏడాదికి నాలుగు జార్లు, జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 తేదీల్లో ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీల కోసం సవరణ జాబితాలను https://ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నుంచి ఆగష్టు 21 వరకూ బిఎల్ఒలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ఒకే ఇంటి నెంబర్‌లో 10 ఓటర్లకు మించి ఎక్కువగా వున్న ఓటర్లను, తప్పుగా ఉన్న ఓటర్లను ఫారం-8 ద్వారా సవరణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహం, కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ వైఎ.వేదయార్, వైసిపి ప్రతినిధి వర్మ, టిడిపి ప్రతినిధి ఎ.జగదీష్ పాల్గొన్నారు.

గోపాలపురం : డోర్ టు డోర్ వెళ్లి కొత్త ఓట్ల నమోదు, తొలగింపు, సవరణలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి టిఇఎం.రాజు అన్నారు. గురువారం గోపాలపురం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎం.రామకృష్ణ, డి.రామకృష్ణరాజు, ఆర్.శ్రీదేవి, రవీంద్రనాథ్, డిటి.కృష్ణ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని తహశీల్దార్ జి.కనకరాజు బిఎల్ఒలకు సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులు, బిఎల్ఒలకు ఓటరు నమోదుపై అవగాహనా సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిఎల్ఒలు ఇంటింటా తిరిగి ఓటర్లను గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీల నేతలకు ఓటర్ల వివరాల సేకరణలో ఏమైనా సందేహాలు ఉంటే బిఎల్ఒలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నేతలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.



రాజానగరంలో ధర్నా చేస్తున్న విఆర్ఎలు

కనీస వేతనం కోసం విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - రాజానగరం, పెరవలి

నెలకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు గురువారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం పేస్కేలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జాజిమెగ్గల వెంకట రమణ, మండల అధ్యక్షుడు ఆర్.బుల్లియ్య, కార్యదర్శి పత్తి చంద్రరావు, తాతపూడి కేసు తదితరులు పాల్గొన్నారు. పెరవలిలో రాష్ట్ర పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘ అధ్యక్షులు కాకరపర్తి సత్తిపండు ఆధ్వర్యంలో రిలే దీక్ష కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ డిఎతో కూడిన పేస్కేల్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఆర్.విఠల్‌బాబు, సిహెచ్.రామ కృష్ణ, జివిడి.రామకృష్ణ, రాధ, నాగరత్నం, మంగ, చంద్రావతి, సుధా దేవి పాల్గొన్నారు

పంపిణీకి పాఠ్యపుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సెకండ్ సెమిస్టరీ పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తిరుమలదాస్ అప్పారావు తెలిపారు. 45 పాఠశాలకు 16,038 పాఠ్యపుస్తకాలను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారని తిరుమల దాస్ తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ తెరవాలని ధర్నా

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో షుగర్ ఫ్యాక్టరీని తెరవాలని, కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీల ప్రయివేటీకరణను ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మూసివేసిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్ చేస్తూ చాగల్లు జైపూర్ చెరకు ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మద్దతుగా జువ్వల రాంబాబు మాట్లాడారు రాష్ట్రంలో ఉన్న 29 చెరకు ఫ్యాక్టరీల్లో 24 ఫ్యాక్టరీలు మూతబడ్డాయన్నారు. 11 కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీల్లో గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీ మాత్రమే నడుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో మూతబడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తానని, రైతులకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు మొండిచేయి చూపారని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి సుబ్బారావు మాట్లాడుతూ చాగల్లులో జైపూర్ చెరకు ఫ్యాక్టరీ 1960లో ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి ఎంతో మంది కార్మికులకు, రైతులకెఉ ఉపాధి కల్పించిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల మూతబడిందన్నారు. ఫ్యాక్టరీలను తెరవక పోగా ఆరు కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీలను లిక్విడేషన్ ప్రకటించారన్నారు. ప్రభుత్వం చక్కర విధానాన్ని రూపొందించికొని పరిశ్రమను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో 7లక్షల ఎకరాల్లో చెరకు పండేదని, ఇప్పుడు అది 1.20 లక్షలకు పడిపోయిందన్నారు. హోం మంత్రి నియోజక వర్గంలో ఫ్యాక్టరి మూతబడినా నిమ్మకు నీరెత్తునట్లుగా ఉన్నారని విమర్శించారు. నేరుగా కేంద్రం ప్రభుత్వమే చెరకుకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఈ ధర్నాలో కొటారు నాగేశ్వరరావు, రంగయ్య, కొడవటి రాయుడు, సిపిఎం నాయకులు కెకె.దుర్గారావు, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం, సిపిఎం నాయకులు

సత్యనారాయణ మృతికి ఎంఎల్ఎ సంతాపం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన సంగీతపు సత్యనారయణ మృతికి నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాసనాయుడు సంతాపం తెలిపారు. నివాళులర్పించారు. గురువారం వేగేశ్వరపురంలో సత్యనారాయణ మతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ జిఎస్ రావు వ్యాపార సంస్థల్లో 35 ఏళ్లుగా సత్యనారాయణ పనిచేస్తున్నారు. ఎంఎల్ఎ వెంట సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, వైసిపి నాయకులు శీర్ల బ్రహ్మానందం తదితరులున్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదానికి పిలుపు

నిడదవోలు : 'హలో బిసి - చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిసి సంఘ జాతీయ మహిళా అధ్యక్షులు డాక్టర్ పద్మలత పిలుపునిచ్చారు. గురువారం నిడదవోలులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ బిసి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 24, 25 తేదీల్లో హలో బిసి - చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని, మహిళ బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు. అప్పుడే బిసి మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. మహిళ బిల్లులో బిసి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ వెలగన పొలయ్య, నిడదవోలు మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్స్ బిర్రె పార్వతి, అరుగొల్లు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మణిపూర్ దమనకాండపై నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

మణిపూర్‌లో జరుగుతున్న దమన కాండపై కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ముప్పిడి కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు మాట్లాడారు. మతం పేరుతో మారణకాండకు పాల్పడటం తగదన్నారు. దీనిపై కేంద్రం ఇప్పటికైనా స్పందించి శాంతిని నెలకొల్పాలన్నారు.ఈ కార్యక్రమంలో వెంకట్రావు, కె.రాజు, గోపి, పండు, రాజు సతీష్, గోతియ్య, నల్లమ్మ, సువార్త, వెంకటలక్ష్మి, కవలమ్మ, సత్యవతి, గంగా రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా 116 ఆవిర్భావ దినోత్సవాన్ని బ్యాంక్ మేనేజర్ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బిఒబి వ్యవస్థాపకు సయాజిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కరరావు మాట్లాడుతు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రారంభించి 116 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వి.వాసుకుమార్‌రెడ్డి, నేరయ్య బంగారి, డి.రవికుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బొడ్డు వెంకటరమణచౌదరి

ప్రజాశక్తి - రాజనగరం



టిడిపి రాజానగరం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బొడ్డు వెంకటరమణచౌదరిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ రాజీనామా చేయడంతో బొడ్డు వెంకటరమణచౌదరిని పార్టీ నియమించింది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణరాజు

'బలహీన వర్గాలకు సిఎం అన్యాయం'

ప్రజాశక్తి - గోపాలపురం

చరిత్రలోనే బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కు తుందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకునిగాఉన్నప్పుడు ఉన్నత విద్య పేదల హక్కు అని జగన్ ప్రకటనలు గుప్పించారన్నారు. అధికారం చేపట్టిన తరువాత జిఒ 77తో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ,మైనారిటీలు పీజీ చేసేందుకు స్కాలర్ ఇవ్వకుండా జిఒలు తీసుకొచ్చాన్నారు. కోర్టు ఆదేశించినా మేనేజింగ్ కోటలో వారికి నేటికీ స్కాలర్ ఇవ్వట్లేదన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసింది జగన్ మాత్రమే అన్నారు. దేశంలో ఎక్కడాల లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌కే రాజధాని లేదని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షులు కాట్నం గణేష్, నాయకులు చోడసాని బాపిరాజు, పి.గణపతి, ఆర్.శ్రీను, పి.రాంబాబు, జి.సత్యనారాయణ, ఆర్.శ్యామ్, నాగేంద్ర, మాలే సతీష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అధికారపక్షం వాళ్లనేమైనా విమర్శించారా... ఇడి వాళ్లొచ్చారు..!!

కొనసాగుతున్న 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరం సచివాలయం 1, 2లో సర్పంచ్ కొమరం శ్రావణి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ, ఎంపిపి సుంకర శ్రీవల్లి పాల్గొన్నారు. సచివాలయం 1లో 1,535, సచివాలయం 2లో 1,383 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, ఎన్.నరసయ్య, ఏసురత్నం, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, తహశీల్దార్ డి.సుగుణ, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి : మండలం యర్నగూడెం సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్ఎ తలారి వెంకట్రావు హాజరయ్యారు. వివిధ రకాల ధ్రువపత్రాలను అందించారు. అనంతరం గ్రామంలో ఆర్‌బికె, సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గన్నమనే జనార్ధనరావు, వైసిపి మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, కె.వెంకటసతీష్, సర్పంచ్ బి.భరత్‌బాబు, ఎంపిడిఒ కృష్ణంరాజు, తహశీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

గోపాలపురం : ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. గురువారం గోపవరంలో సర్పంచ్ ఎండపల్లి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం ఇటీవల జర్మనీ టెక్నాలజీతో నిర్మించిన రోడ్డును ఎంఎల్ఎ ప్రారంభించారు. సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఇటీవల జర్మనీ టెక్నాలజీతో గజ్జరం నుంచి గోపవరం వరకు 7.6 కిలోమీటర్ల మేర సుమారు రూ.12 కోట్లతో అత్యాధునిక సాంకేత పరిజ్ఞానంతో రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఈ రోడ్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి రాజబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. గోపవరంలో 9వ తరగతి అత్యధిక మార్కులు సాధించిన ముప్పిడి అంకిత, ఎనిమిదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కోడూరి శరణ్ తేజకు ఎండపల్లి బులిరాజు తల్లి ఎండపల్లి వరలక్ష్మి పేరున నగదు ప్రోత్సహకాలు అందించారు. 829 మందికి ధ్రువపత్రాలు, 20 కౌలు కార్డులు అందజేశారు. అనంతరం సర్పంచ్ ఎండపల్లి శేఖర్‌బాబు, కవిత దంపతులు ఎంఎల్ఎను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎఎంసి చైర్మన్, జడ్‌పిటిసి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఎండపల్లి కవిత, ఉప సర్పంచ్ గుడ్ల ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కెఎస్‌వి అనురాధ, ఎంపిటిసి మేణి రామచంద్రరావు, కోడూరి సూర్యరావు, పెండ్యాల కష్ణమూర్తి, మల్లిపూడి నవీన్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : దమ్మెన్ను సచివాలయం వద్ద సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య, దమ్మెన్ను ఉప సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : రఘుదేవపురంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో జక్కంపూడి రాజా మాట్లాడారు. వైసిపి ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని తెలిసే టిడిపి, జనసేనలు రకరకాల పార్టీలతో పొత్తుకోసం వెంపర్లాడుతున్నాయన్నారు. ఎంతమంది కలిసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి గెలుపు ఖాయమన్నారు. నాలుగేళ్లలో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీను, కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, జడ్‌పిటిసి సభ్యులు చల్లమల వెంకట లక్ష్మి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు కొండ్రపు ముత్యాలు, సర్పంచ్ చంద్రలీల, ఎంపిటిసి పంతుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరవలి : ముక్కామల గ్రామపంచాయతీ పరిధిలో సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ మాట్లాడారు. సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేత త్రిమూర్తులు, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీను, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ, గ్రామ సెక్రెటరీ ఎస్ రామచంద్ర, పాల్గొన్నారు.



గోపాలపురం ఎంఎల్ఎ తలారిని సన్మానిస్తున్న సర్పంచ్ శేఖర్‌బాబు, కవిత దంపతులు

నేరాలు ఘోరాలు

ఆర్ఎంపి వైద్యం పేరుతో చోరీలు

ప్రజాశక్తి-కాకినాడ క్రైం

దీర్ఘకాల సమస్యలతో బాధ పడుతున్న వద్ధులను లక్ష్యంగా చేసుకొని వారికి అవసరమైన మందులు ఇస్తానని చెప్పి వారి ఒంటి మీద బంగారు వస్తువులు దొంగలించి పారిపోయే ఒక ఆర్ఎంపిని పెదపూడి పోలీసులు పట్టుకున్నారు. దీనికి ఎస్పి ఎస్.సతీష్ కుమార్ కాకినాడలోని తన కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంనకు చెందిన గిరుతూరి విశ్వనాథం ఆర్ఎంపి వైద్యునిగా చెప్పుకుంటూ వివిధ గ్రామాల్లో ఉన్న వద్ధులను లక్ష్యం చేసుకునేవాడు. ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు తీసి పక్కన పెట్టాలని అలా పెట్టకపోతే ఇంజెక్షన్ ఇన్ఫెక్షన్ వస్తుందంటూ మాయమాటలు చెప్పి బంగారు వస్తువులను దొంగలించుకోవడం అలవాటుగా చేసుకున్నారన్నారు. ఎస్ఐ.పివాసు బందం అతడిని అరెస్టు చేసి 164 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

గొల్లప్రోలులో రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యాన గురువారం సివిల్ సప్లయి, లీగల్ మెట్రాలజీ అధికారులు పలు షాపులను తనిఖీ చేశారు. వెంకటనాగలక్ష్మి ట్రేడర్స్లో రెండు కేసులు, శ్రీ సాయి శివ కష్ణ జనరల్ స్టోర్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఒక కేసు, శ్రీ లక్ష్మీ గణపతి ఆయిల్ జనరల్ స్టోర్లో సివిల్ సప్లయిస్ షాపు యజమానిపై 6 ఎ కేసు నమోదు చేసి రూ 2,11,750 విలువైన పప్పు ధాన్యాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ విజయ కుమార్, కానిస్టేబుల్స్ లోవ కుమార్,లోవరాజు పాల్గొన్నారు.

తోట నరసింహంతో చర్చకు సిద్ధం

ప్రజాశక్తి-జగ్గంపేట

ఆత్మీయ సమావేశాల పేరుతో ఎంఎల్ఎ చంటిబాబును విమర్శిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహంతో చర్చలకు సిద్ధమేనని జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జె.సుబ్బారావు ప్రకటించారు. వైసిపి నాయకులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పార్టీ శ్రేణులను, ఎంఎల్ఎ చంటిబాబును విమర్శించడం సరికాదన్నారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డి ముందుకు ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. గోకవరం మండలంలోని కామరాజుపేటలో ఆత్మీయ సమావేశం పేరుతో ఎంఎల్ఎ చంటిబాబును, తనను కూడా విమర్శించారన్నారు. పార్టీకి నష్టం కలిగించే సభలను పెట్టకుండా ఉంటే మంచిదన్నారు. ముఖాముఖి చర్చకు సిద్ధమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, గండేపల్లి ఎంపిపి చలగళ్ల దొరబాబు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ బాబి, గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు, కుంచే జాస్తి వసంత్, రాజా, కందుల చిట్టిబాబు, ముమ్మన్న సోమరాజు, రాష్ట్ర సీడ్స్ కోఆర్డినేటర్ అప్పారావు, లక్ష్మణ దొర, ఒంటిపల్లి రామన్న దొర పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఉధృతంగా గౌతమీ గోదావరి

ప్రజాశక్తి - యానాం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద కారణంగా యానాం గౌతమి గోదావరి నది బాలయోగి వారధి వద్ద వరద నీరు ఉధతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో యానాం అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి గురువారం గోదావరి నది తీరాన్ని పరిశీలించారు. అధికారులు, లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

8న యోగా శిక్షకులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యానాం

యానాం రీజినల్, స్టేట్ హెల్త్ సొసైటీల ఆధ్వర్యంలో యోగా శిక్షకుల నియామకానికి ఆగస్టు ఎనిమిదో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మిషన్ డైరెక్టర్ జి.శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు యానాంలో నిర్వహిస్తారన్నారు వివరాలకు health.py.gov.inలో చూడాలన్నారు.

తోటి డ్రైవర్కు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - యానాం

యానాం టాక్సీ స్టాండ్లో డ్రైవర్ సొర్రా నాగు గాడయపడడంతో తోటి డ్రైవర్లు రూ.15 వేల విరాళాలు సేకరించి సాయం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ డ్రైవర్లను అభినందించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందకపోయినా సాటి డ్రైవర్ను ఆదుకోవడంలో డ్రైవర్లు ముందుకు రావడం సంతోషమన్నారు.

ఎంఎల్ఎ అశోక్కు ఆర్ఎఒ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలుకు శాస్త్ర చికిత్స చేయించుకున్న యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ను యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పరామర్శించారు. గురువారం స్థానిక గోపాల్ నగర్లోని ఎంఎల్ఎ నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఏజెంట్స్, అధికారులను నియమించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నేటి నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటికీ ఓటర్ సర్వే చేపడతామని, వార్డులో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు తమ బూతు లెవెల్ ఏజెంట్ అధికారులను నియమించుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ రావిరాల మహేష్ కుమార్ పేర్కొన్నారు ఎరువారం కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ ఐడి ఏర్పాటు చేశామన్నారు. వీరికి ఎవరు అందుబాటులో ఉన్నారు, ఎవరికి కొత్త ఓటు రావాలి, మార్పులు చేర్పులు ఇతర అంశాలపై సర్వే ప్రారంభించినట్టు చెప్పారు. ఎటువంటి తప్పులకూ లోను కాకుండా అన్ని రాజకీయ పార్టీ నాయకులు అందరూ ఏజెంట్లను నియమించుకుంటే బాగుంటుందన్నారు. సర్వే సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

మాచరలో గడప గడపకూ..

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలోని మాచరలో గురువారం గురువారం గడప..గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్సి తోట త్రిమూర్తులు, గ్రామ వైసిపి నాయకులతో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి తదితరులు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు

ప్రజాశక్తి-పెదపూడి

వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సచివాలయం కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని కాకినాడ డిఎల్పిఒ టి.అన్నామణి అన్నారు. పెదపూడి సచివాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చాలన్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని దీంతో అంటువ్యాధులు ప్రబలి అవకాశ ఉందన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది. సచివాలయం సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ, వైరల్ జ్వరాలు సోకకుండా ముందుగానే తగిన చర్యలు చేపట్టాలన్నారు. మురుగు గుంటల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. తాగునీరు క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందకి నిబంధనల ప్రకారం అందించాన్నారు. సచివాలయం సేవలను ప్రజలకు అందుబాటులో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి మన్యం శ్రీనివాసు చౌదరి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బాలాత్రిపుర సందరి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్


సమావేశంలో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

పట్టణ పరిధిలో పెండింగ్లో ఉన్న టిడ్కో లబ్ధిదారులకు రుణాలును బ్యాంకర్లు సత్వరమే మంజూరు చేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఎన్న పలు బ్యాంకుల మేనేజర్లతో టిడ్కో లబ్ధిదారుల రుణాల మంజూరు పెండింగ్ అంశంపై చర్చించారు. పెండింగ్ రుణాలును సత్వరమే మంజూరు చేయాలని కమిషనర్ కోరారు. మృతులు, సిబిల్ ప్రాబ్లమ్స్, అధిక వయస్సు వారి సమస్యలను మున్సిపాల్టీ ఆధ్వర్యంలో సతర్వమే పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. రుణాలు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రుణాలు మంజూరు చేయాలని కమిషనర్ రామారావు సూచించారు. ఈ సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పి.సుజాత, సిఒలు పి.ప్రసాద్, నర్గీస్ పాల్గొన్నారు.

విఆర్ఎలకు డిఎతో కూడిన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విఆర్ఎలకు డిఎతో కూడిన వేతనం చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రతిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన విఆర్ఎలను విఆర్ఒలుగా నియమించాలని, మరణించిన విఆర్ఎల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, విఆర్ఎలకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాడు నియోజకవర్గ ఇన్ఛార్జి ఉమ్మిడి వెంకట్రావు, జనసేన నాయకులు నల్లల రామకృష్ణ, శేషారావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి రామకృష్ణ, ఎం.సత్తిబాబు, వి.దాసు, ఎం.గంగరాజు, బి.తాతబ్బాయి, శోభ, కుమారి తదితరులున్నారు.

లయన్స్ ఆధ్వర్యాన సామాజిక సేవలు

ప్రజాశక్తి-అన్నవరం


ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేటి సమాజంలో పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే పలు సామాజిక సేవా కార్యక్రమాలకు అన్నవరం సత్యదేవ లయన్స్ క్లబ్ దోహదపడుతుందని శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు అన్నారు. గురువారం అన్నవరంలో సత్యదేవ లైన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపిపి రాజబాబు, లయన్స్ రీజనల్ చైర్మన్ పర్వత జానకి రాజబాబు మాట్లాడారు. ముందుగా క్లబ్బు నూతన అధ్యక్షునిగా పసగడుగుల నానాజీ, కార్యదర్శిగా పంచాది గుర్రాజు, కోశాధికారిగా కాలి బోయిన సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దొంకాడ గిరి పంచాది సునీత గుర్రాజు, రమేష్బాబు, ఎం.అర్జున్రావు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీటితో అవస్థలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు పంచాయతీ చెరువుగట్టు సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మెయిన్ రోడ్పై వర్షం నీరు పోయేందుకు పంచాయతీ సిబ్బంది కచ్చ డ్రైన్ ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఎటువంటి కచ్చా డ్రైన్ నిర్మించక పోవడంతో మెయిన్ రోడ్డు పైనే వర్షపు నీరు నిలిచిపోతోంది. దీనికి తోడు ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్, గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటికి చెందిన ఇసుక, ఇటుక, కంకర వంటి మెటీరియల్ రోడ్డుపైనే వేశారు. దీంతో బయటికి వెళ్లే దారి లేక మెయిన్ రోడ్డుపై నిలిచిపోయింది.

ఎంబిబిఎస్ సీట్లపై ఉత్తర్వులు తగవు

ప్రజాశక్తి-కాకినాడ

అదనపు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 50 శాతం ఎంబిబిఎస్ సీట్లకు సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా కేటాయింపులు చేపట్టడం మంచి పద్ధతి కాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. మూడు కేటగిరీల్లో రూ.15 లక్షలు, రూ.12 లక్షలు, రూ.20 లక్షలు వసూలు చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు విడుదల చేయడం ప్రభుత్వ విధానాలకు మంచి పరిణామం కాదన్నారు. తెలంగాణలో ఇటువంట విధానం లేదన్నారు.

వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మారేడుబాక రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ రక్తదానం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న పిల్లి రాధిక, కోరుకొండ శాంతి, మహ్మద్ ఖదీర్ ముల్లా, ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కె.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డా.టికెవి.శ్రీనివాసరావు విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగపతి డా. జె నెహ్రూ నాయక్, వైస్ ప్రిన్సిపల్ ఆనందరావు, లైబ్రేరియన్ వెంకన్న, అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆధ్యాత్మిక సేవా భావనతో పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. తిరుపతి శ్రీ వృంగార వల్లభ స్వామి ఆలయ నూతన పాలక మండలిసభ్యుల ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. నూతన చైర్మన్గా కర్రి వెంకట జగదీశ్వరరావు, పాలకమండలి సభ్యులుగా కుంచే వెంకటరమణ, రాకుర్తి కుమారి, అమలదాసు లక్ష్మి, అడబాల జగ్గారావు, అడపా శివ, పుల్లేటి కుమారి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణచార్యులుతో ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, కంటే వీరరాఘవరావు, గోపు మురళి, జెడ్పిటిసి కుంచే బుచ్చిరాజు, ఆవాల లక్ష్మీనారాయణ, కనపర్తి సీమ దొర, ఒబిలిశెట్టి అబ్బాయి, వినుకొండ వీర విష్ణు చక్రం, శైల గణేష్, బర్రె రామ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన వైసిపి ప్రభుత్వానికే సాధ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించే పాలన వైసిపి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు అన్నారు. గురువారం స్థానిక 4వ సచివాలయం పరిధిలోని 6, 7 వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు వైసిపి సంక్షేమ పాలనపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, ఎఎంసి వైస్ చైర్మన్ బండారు వీరబాబు,కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, కాపుగంటి సౌందర్య లక్ష్మి, టిపిఒ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నారు మళ్ళు ముంపునకు గురవుతున్నాయని, రైతులంతా వర్షం తగ్గిన వెంటనే పొలంలో నీటిని తొలగించి ఆరుదల పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పేర్కొన్నారు. గురువారంపాలగుమ్మి,నల్లమిల్లి గ్రామాల్లో ఆర్బికెలను సందర్శించి రిజిస్టర్లు, కియోస్కు, కొత్తగా నిర్మిస్తున్న ఆర్బికెలను పరిశీలించారు. పాలగుమ్మి లో వరి చేలు పరిశీలించి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు సూచనలు చేశారు.నల్లమిల్లి లో నారు మడులను పరిశీలించి అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో జరుగు నష్టం గురించి రైతులకు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని రైతులందరూ జాగ్రత్తలు పాటించి తమ పంటలను రక్షించుకోవాలని జిల్లా తెలియజేశారు. కార్యక్రమంలో అమలాపురం సహాయ వ్యవసాయ సంచా లకులు ఎంఎ షంషి, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మ ప్రసాద్, ఎఇఒ, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం డివిజన్ పరిధి లోగల ఈదరపల్లి 33/11 కెవి స్టేషన్, బాలయోగి ఘాట్ 33/11 కెవి సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారము ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇ ఎమ్.రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సబ్స్టేషన్ల పరిధిలో గల ఆర్టిసి రోడ్డు, నారాయణపేట కె.అగ్రహారం, హైస్కూల్ రోడ్, సూర్యనగర్, భూపయ్య అగ్రహారం, కాలేజీ రోడ్ ముమ్మిడివరం గేట్ గవర్నమెంట్ హాస్పిటల్ విద్యుత్ నగర్, సావరం, ఆర్డీవో ఆఫీస్ రోడ్, నల్లవంతెన, కలెక్టర్ ఆఫీస్ జనుపల్లి, ఎ.వేమవరం, మాగం, నేదునూరు, ఈదరపల్లి, ఇందుపల్లి, బండారులంక ప్రాంతాలలో విద్యుత్ కు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. **అయినవిల్లి** మండలంలో అయినవిల్లి సబ్స్టేషన్ పరిధిలో గల అయినవిల్లి, ముక్తేశ్వరం, మూలపొలం, కె.జగన్నాథపురం విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు ట్రాన్స్ ఫార్మర్ మరియు ఎబి స్విచ్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని గురువారం మండల విద్యుత్శాఖాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు

పలుచోట్ల 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు. వివరాలు ఇవి..

రామచంద్రపురం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99శాతం మంది అర్హులైనలబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలుచేరాయన్నారు.కార్యక్రమంలో రామచంద్రపురం ఎంపిపి అంబటి భవాని, తహశీల్దార్ తేజేశ్వరరావు, వైస్ ఎంపిపి నరాల రాజ్యలక్ష్మి, జెడ్పిటిసి సభ్యుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పి గన్నవరం నియోజకవర్గ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం తొత్తరమూడి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వార జయ సావిత్రి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపిడిఒ వెంకటాచార్యులు, డిటి అశోక్, వైస్ ఎంపిపి బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రణాళిక బద్ధంగా ఉత్తమ భోధనతో కూడిన పాఠాలు నేర్పుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఇంఛార్జి డివైఇఒ, స్థానిక 1వ మండల విద్యశాఖ అధికారి పి.షాలెంరాజు అన్నారు. గురువారం ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా ఎండిఎంలో నాణ్యతలను, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల విద్యా వ్యవస్థపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలుపరిచేలా తన వంతు కషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మండపేట

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా దిశ డిఎస్పి మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని ద్వారపూడి జెడ్పి బాలిక ఉన్నత పాఠశాలలో దిశ చట్టం, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. పలువురు మాట్లాడుతూ గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, చైల్డ్ ఫోర్నోగ్రఫీ, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తులా శేషారావు, రూరల్ ఎస్ఐ శివకష్ణ, గ్రామ పెద్దలు, స్కూల్ హెచ్ఎం, టీచర్స్ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం కత్తివెంటి పేర్రా జు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 21 నుంచి ఎనిమిదవ సబ్ జూనియర్స్ బాస్కెట్ బాల్ అంతర్ జిల్లాల ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు గన్నమనేని చక్రవర్తి గురువారం తెలియజేశారు ఈ పోటీలు గన్నమని భానుమతి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 12 బాలుర,9 బాలికల జట్లు వస్తాయని రాష్ట్ర బాస్కెట్బాల్ ప్రధాన కార్యదర్శి చక్రవర్తి తెలిపారు రామచంద్రపురం బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలలో ఎంపికైన బాల బాలికల జట్లు ఆగస్టు రెండో తేదీ నుంచి పాండిచ్చేరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల మూడవ సంవత్సరం బి టెక్ ఇసిఇ, విద్యార్థులు గురువారం పారిశ్రామిక పర్యటన చేశారు.. ఈ పర్యటన లో భాగముగా కళాశాల విద్యార్థులు అగపంపూడి విశాఖ జిల్లాలో పలు పలు ఫ్యాక్టరీలను సందర్శించారు. ఈ పర్యటన అనంతరం కళాశాల లో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్విఎస్ .పరమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్జన దశలో ప్రతి విద్యార్థి ప్రత్యక్ష పరిశీలన విషయ జ్ఞానాన్ని ఆకళింపు చేసుకొనుట ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎన్ఎస్.వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్ మరియు రమేష్ రాజు , ఇసిఇ విభాగపతి డాక్టర్ ఎస్ఎస్.శరవణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా డోర్ టు డోర్ ఓటర్ సర్వే

ప్రజాశక్తి-పిఠాపురం

ఓటర్ల సర్వేలో భాగంగా బిఎల్ఒలు సమిష్టిగా ఓటరు జాబితాపై సమగ్ర సర్వే చేయాలని పిఠాపురం నియోజవర్గ ఎన్నికల అధికారి, కూడా చైర్మన్ కె.సుబ్బారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు పరిధిలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు డోర్ టు డోర్ ఓటర్ల జాబితాపై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. ప్రధాన పార్టీల నుంచి బిఎల్ఎలు ప్రభుత్వ నుండి బిఎల్వోలు సర్వే పూర్తి చేయాలని పార్టీ నాయకులను కోరారు. పిఠాపురం పట్టణంలో అగ్రహారం మండలంలో చిత్రాడ ఒకే డోర్ నెంబర్తో 100 పైబడి ఓట్లు ఉన్నాయని అవి తమ దృష్టికి వచ్చాయని అయితే అక్కడ ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్న వారు ఉండడం చేత ఒకే డోర్ నెంబర్ తో అన్ని ఓట్లు ఉన్నాయని కలెక్టర్ అనుమతితో తాత్కాలిక డోర్ నెంబర్లు వేసి ఆధార్, ఓట్లు అడ్రస్సులు డోర్ నెంబర్లు మార్పు చేస్తామన్నారు. సమావేశంలో పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్య నారాయణ, పిఠాపురం తహశీల్దార్ పితాని త్రినాధ రావు, గొల్లప్రోలు తహశీల్దార్, కాంగ్రెస్ పార్టీ నుండి మేడిది శ్రీనివాసరావు, వైసిపి నుండి బొజ్జ దొరబాబు, టిడిపి నుండి అల్లుమల్లు విజయకుమార్, సిపిఐ నుండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి డోర్ టు డోర్ సర్వే

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏలేశ్వరం మండలంలో జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నామని తహశీల్దార్ చిన్నబాబు తెలిపారు. ఈ సర్వేలో ఆయా గ్రామాల బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులతో పాటు నూతన ఓటర్లను చేర్పించడంతో పాటు ఓట్లను తొలగిస్తారని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.